### యువోత్సాహం



జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు సమీపంలోని ఓ హోటల్ వద్ద ఆగిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఆనందంగా సెల్ఫీలు దిగుతున్న యువతులు

### చిన్నారి సంబురం



జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు సమీపంలో ఓ హోటల్ వద్ద ఓ చిన్నారికి సెల్ఫీ ఇస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి

### దండాలయ్యా.. మళ్లీ మీరే రావాలయ్యా!



జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద హోటల్‌లో ఉన్న తనను చూసేందుకు వచ్చిన సమీప గ్రామాల మహిళలకు అభివాదం చేస్తున్న కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# ఎవలకన్న వచ్చినయా?

మొదటిపేజీ తరువాయి...

ఆదివారం జగిత్యాలలో నిర్వహించిన రోడ్‌షోలో కేసీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగమాగం చేసిందని, అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చి మోసం చేసిందని మండిపడ్డారు. గతంలో ఉన్న పథకాలను బంద్ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.. ఇచ్చిన హామీలు నెరవేర్చడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగిత్యాల జిల్లాను తీసివేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్‌లో బీఆర్ఎస్ గెలిస్తే జిల్లా కోసం పోరాడవచ్చని పేర్కొన్నారు. మోదీ పదేండ్ల పాలనలో ఏ ఒక్క వర్గానికీ న్యాయం జరగలేదని విమర్శించారు. రాష్ట్రం నుంచి నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా ఎలాంటి ప్రయోజనమూ జరగలేదని తెలిపారు.



జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో పెద్దపల్లి, నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థులు కొప్పుల ఈశ్వర్, బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు.

### ఈ ప్రభుత్వానికేం తెల్వది

'ఇప్పుడున్న ప్రభుత్వానికేం తెల్వది. ఏ పనీ సరిగా చేయొస్తలేదు' అని కేసీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో వరద కాల్వను రిజర్వాయర్‌గా మార్చుకున్నామని, దానిపై మత్స్యకారులు, రైతులు బతికారని గుర్తుచేశారు. చెరువులు నింపడానికి వరద కాల్వకు ఎక్కడికక్కడ ఓటీలు పెట్టామని తెలిపారు. చొప్పదండి, బాల్కొండ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కావాల్సినన్ని తూములు ఏర్పాటు చేయించి, చెరువులు నింపినట్టు చెప్పారు. వాటికింద రైతులు వ్యవసాయం చేసి బాగా బతికారని గుర్తు చేశారు. 'ఇప్పుడు వరద కాలువను ఎందుకు ఎండబెట్టారు? దీనికి బాధ్యులు ఎవరో ఆలోచించాలి' అని ప్రజలను కోరారు. బీడీ కార్మికులు, చేనేత కార్మికులను పట్టించుకోవడం లేదని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు రావడం లేదని, దీనికి కారణం ఏమిటో ఆలోచించాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం పెట్టిన స్కీములను పట్టించుకోకపోయినా, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలైనా అమలవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### పాత పథకాలు బంద్‌పెట్టే దుర్మార్గం

అన్నవస్త్రానికి పోతే ఉన్నవస్త్రం పోయినట్టు.. కొత్త పథకాలు వస్తాయనుకుంటే అవి గంగలో కలిశాయని, పాత వాటిని కూడా బంద్‌పెట్టే దుర్మార్గం జరుగుతున్నదని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో పట్టణ పేదలకు రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చి అందరి ఇండ్లలో నల్లాలు పెట్టి గోదావరి నీళ్లు దుంకించినట్టు చెప్పారు. మిషన్ భగీరథ నీళ్లు, కరెంటు కోతలపై అడిగిన ప్రశ్నలకు ప్రజల నుంచి చక్కని స్పందన లభించింది. ఇన్నేండ్లు వచ్చిన కరెంటు ఎక్కడికి పోయిందని, తాగు నీళ్లు ఎందుకు బందయ్యాయని, ఈ ప్రభుత్వానికి ఏం రోగం వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి నేత కార్మికులు, బీడీ కార్మికులు, గీతకార్మికులు పట్టరని విమర్శించారు. ఈ ప్రభుత్వం ఏ ఒక్కరి సంక్షేమం చూడడం లేదని, ఐదు నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగం చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు.

> మీ కండ్లముంగటనే మీ గోదావరి నీళ్లను నేను ఎత్తుకుపోతాను అని మోదీ అంటుంటే ఈ ముఖ్యమంత్రి సప్పుడు చేయడు. గోదావరిని పోనిద్దామా? ఎవరు కాపాడాలి గోదావరిని? బీజేపోడు, కాంగ్రెసోడు గెలిస్తే మాట్లాడతరా? మూతి, చేతులు ముడుసుకొని ఉంటరు తప్ప మాట్లాడరు. -కేసీఆర్

## గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ ఏమైంది?

**తెలంగాణలోని** గిరిజన బిడ్డలకు బీఆర్ఎస్ హయాంలో 10శాతం రిజర్వేషన్ ఇచ్చామని కేసీఆర్ తెలిపారు. 'గిరిజనులకు రిజర్వేషన్లపై హైకోర్టులో కేసు పెడితే, దాని తరఫున ప్రభుత్వం గట్టిగా వాదించాలి కదా? రిజర్వేషన్ కావాలని నిలదీయాలి కదా. కేసు గెలిచి, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి కదా? శాస్త్రీయంగా లెక్కచేసి చెప్పినా కూడా వాళ్లకు పెట్టే పరిస్థితి లేదు' అని రాష్ట్రప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. నాడు తెలంగాణలో వరద కాల్వలను రిజర్వాయర్లు చేసుకున్నామని తెలిపారు. తెలంగాణవ్యాప్తంగా 3 కోట్ల టన్నుల వడ్లను పండించామని, నాడు వడ్లను కొనేందుకు మోదీ నిరాకరిస్తే ఢిల్లీలో ధర్నా చేసినట్టు గుర్తుచేశారు. యాసంగి వడ్లు కొద్దిగా నూకలు అవుతాయని చెప్తే.. తెలంగాణ వాళ్లనే ఆ నూకలు తినమన్న నూకరాజు మన ప్రధాని మోదీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వ్యక్తికి ఓటెందుకు వేయాలని నిలదీశారు. ఈ రాష్ట్ర భవిష్యత్తు మీదే కాబట్టి ఎవరు గెలిస్తే మంచిదో ఆలోచించి ఓటు వేయాలని యువతకు విజ్ఞప్తి చేశారు.

## జగిత్యాల జిల్లాను తీసేస్తరట

**ఉద్యమ** సమయంలో తాను జగిత్యాలకు చాలాసార్లు వచ్చానని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. జగిత్యాల జిల్లా ఏర్పడడం దశాబ్దాల కల అని చెప్పారు. చివరికి తాము జిల్లా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జగిత్యాలలో మెడికల్ కాలేజీ ఏర్పాటవుతుందని ఏనాడూ ఊహించలేదని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం జగిత్యాల జిల్లాను తీసేస్తా అంటున్నదని మండిపడ్డారు. 'జగిత్యాల జిల్లా ఉండాల్నా? పోవాల్నా?' అని ప్రశ్నించగా.. 'ఉండాలి' అంటూ ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు. జగిత్యాల జిల్లా ఉండాలంటే నిజామాబాద్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్, పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్, కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్ గెలవాలని కేసీఆర్ కోరారు.

### గంగలో రాష్ట్రం పరువు

దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి, ఆరేడేండ్లు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని కేసీఆర్ గుర్తు చేశారు. తాము రైతుబంధు కాకుండా రైతు భరోసా ఇస్తామని, రూ. 7,500 చొప్పున ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ మొదటి రూ. 5 వేలకే దిక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధును ఐదెకరాలకే పరిమితం చేస్తామని అంటున్నారని, మరి ఆరేడు ఎకరాల రైతులు ఏం పాపం చేశారని సూటిగా ప్రశ్నించారు. రైతుబంధుపై నియంత్రణ పెట్టాలనుకుంటే 20-25 ఎకరాలకు పెట్టాలని సూచించారు. ఈ ప్రభుత్వం వడ్లు కూడా కొనడం లేదని, తాను వస్తుంటే రోడ్లకు ఇరువైపులా ధాన్యం కుప్పలు కనిపించాయని తెలిపారు. ప్రభుత్వం యాసంగి వడ్లు కొనడం లేదని, రూ. 500 బోనస్ ఇవ్వలేదని, బోనస్ బోగస్ అయిందని దుమ్మెత్తిపోశారు. డిసెంబరు 9న 2 లక్షల రుణమాఫీ చేస్తానన్నాడని, అయిందా? అని ప్రశ్నించారు. కాలేదంటూ రైతులు నినదించారు. తెలంగాణ మొత్తంలో ఎక్కడ అడిగినా ఇదే మాట చెప్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ ఊరికి వెళ్తే అక్కడి దేవుడిపై ఒట్టు పెడుతున్నాడని, ఇలాంటి సీఎంను నమ్మొచ్చా? అని అడగ్గా, 'లేదు.. లేదు' అని బదులిచ్చారు. తెలంగాణ కోసం తాను ప్రాణం అడ్డం పెట్టి 15 ఏండ్లు రాజీలేని పోరాటం చేశానని, తాను నిమ్స్‌లో పడి ఉంటే ప్రజలు నిరాహార దీక్షలు చేసి పులుల్లాగా కొట్లాడితే రాష్ట్రం వచ్చిందని గుర్తు చేశారు. ఐటీలో, పారిశ్రామికరంగంలో రూ.లక్షల కోట్ల పరిశ్రమలు తెచ్చామని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ చర్యల ఫలితంగా ప్లాస్టిక్, అల్యూమినియం పరిశ్రమలు బేజార్ అవుతున్నాయని, పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదిలి వెళ్లిపోవాలని ఆలోచిస్తున్నారని వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. 'ఈ దుర్మార్గ ప్రభుత్వం వల్ల రాష్ట్రం పరువు గంగలో కలిసిపోతున్నది' అని ఆవేదన వ్యక్తం చేశారు.

> కేసీఆర్ గుండె చీల్చితే తెలంగాణ ఉంటది. కేసీఆర్ బతికి ఉన్నంత వరకు తెలంగాణ కోసం అంకితమై పోరాడుతడు. నాకు వేరే లక్ష్యం లేదు. తెలంగాణే నా లక్ష్యం. - కేసీఆర్

### మోదీ పాలనతో 'సచ్చేదిన్'

రైతులు, గిరిజనులు, మహిళలు, నిరుద్యోగులు.. ఇలా మోదీ ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గానికీ న్యాయం జరగలేదని కేసీఆర్ ధ్వజమెత్తారు. పదేండ్ల పాలనలో అచ్చే దిన్ వచ్చిందా? అని ప్రజలను అడగ్గా.. 'లేదు.. లేదు' అంటూ సమాధానం వచ్చింది. బీజేపీ పాలనలో అచ్చే దిన్ రాలేదుగానీ, అడ్డగోలుగా ధరలు పెరిగి సచ్చేదిన్ వచ్చిందని మండిపడ్డారు. 'అమృత్ కాల్' వచ్చిందా? 'భేటీ పడావో.. భేటీ బచావో' వచ్చిందా? 'జన్‌ధన్' ఖాతాలో డబ్బులు పడ్డయా?' అని ప్రశ్నించగా రాలేదంటూ ప్రజలు సమాధానమిచ్చారు. 'జగిత్యాలలో రూ.15 లక్షలు పడ్డయట కదా?' అని అడగ్గా.. 'పడలేదు' అని చెప్పారు. రూపాయి విలువ డాలర్‌తో పోల్చితే రూ.84కు పడిపోయిందని తెలిపారు. ఎగుమతులు బంద్ అయ్యాయని, దిగుమతులు పెరిగాయని, దేశంపై రూ.100 లక్షల కోట్లు అప్పులు పెరిగాయని ఆరోపించారు.

## కేసీఆర్‌పై చెరగని అభిమానం

మల్యాల, మే 5: జగిత్యాల రోడ్‌షోకు వెళ్తున్న కేసీఆర్ కొండగట్టు దిగువన ఓ హోటల్ వద్ద కాసేపు ఆగారు. అక్కడ సమోసా తిని చాయ్ తాగారు. విషయం తెలుసుకున్న స్థానికులు భారీ సంఖ్యలో గూమిగూడారు. మహిళలు, చిన్నారులు, నేతలు కేసీఆర్‌ను కలిసి సెల్ఫీలు దిగి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కేసీఆర్ వెంట కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, పన్యాల భూపతిరెడ్డి, రాంమోహన్‌రావు, తిరుపతిరెడ్డి ఉన్నారు.

### నలుగురు బీజేపీ ఎంపీలు నాలుగు రూపాయలు తేలె

'బీజేపీకి, కాంగ్రెస్‌కు పోటీ ఉంది. బీఆర్ఎస్‌కు ఎంపీలు ఎందుకు?' అని కొందరు మాట్లాడుతున్నారని, ఇక్కడ గతంలో నలుగురు బీజేపీ ఎంపీలు గెలిచారని, వాళ్లు కేంద్రం నుంచి నాలుగు రూపాయలైనా తీసుకురాలేదని కేసీఆర్ తెలిపారు. 'ఏమైన్నా అభివృద్ధి చేసిండ్రా' అని కేసీఆర్ ప్రశ్నించగా.. 'లేదు' అని ప్రజలు సమాధానం ఇచ్చారు. 'నిజామాబాద్‌లో ఎంపీగా గెలిచిన అర్వింద్ పొద్దున్నే లేస్తే విషం చిమ్మడం తప్ప, నాలుగు రూపాయల పనైనా కాలేదు' అని కేసీఆర్ నిప్పులు చెరిగారు. 'పసుపు బోర్డు వచ్చిందా? నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిచిండ్రా' అని కేసీఆర్ ప్రశ్నించగా.. 'లేదు, లేదు' అని ప్రజలు నినదించారు.

### పేగులు తెగేదాకా కొట్లాడేది బీఆర్ఎస్సే

'ఈ కాంగ్రెస్ మెడలు వంచి ఆరు గ్యారెంటీలు అమలు చేయించాలంటే బీఆర్ఎస్ పార్టీ గెలవాలి. మన నదులు కాపాడాలంటే బీఆర్ఎస్ గెలవాలి. ఢిల్లీ నుంచి నిధులు రాబట్టాలంటే బీఆర్ఎస్ ఎంపీలు గెలవాలి. ఆనాటి నుంచి ఈనాటి వరకు తెలంగాణ కోసం పేగులు తెగేదాకా కొట్లాడేది ఒకే ఒక్క పార్టీ బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్ కార్యకర్తలు మాత్రమే. నరేంద్రమోదీ మనకు ఉన్న గోదావరి నుంచి నీళ్లను తమిళనాడు, కర్ణాటకకు తీసుకుపోతా అంటున్నాడు. బీజేపీ ఎంపీలు గెలిస్తే మోదీ ముందర మాట్లాడతరా? అదే ఇక్కడ బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తే పార్లమెంట్ దద్దరిల్లేలా కొట్లాడతరు. మన గోదావరి మనకు ఉండాలన్నా, మన కృష్ణా నీళ్లు మనకు దక్కాలన్నా, మన హక్కులు మనకు ఉండాలన్నా, మన నిధులు మనకు రావాలన్నా, న్యాయం జరగాలన్నా కచ్చితంగా బీఆర్ఎస్ ఎంపీలే ఉండాలి. వారే గెలువాలి. బీఆర్ఎస్ బిడ్డలైతేనే పేగులు తెగేదాకా కొట్లాడతరు.

### బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ

'జగిత్యాల ముస్లిం బిడ్డలకు నమస్కరించి చెబుతున్నా మీరు ఓటు వేసేముందు ఆలోచించండి. బీఆర్ఎస్ ఎప్పుడూ సెక్యులర్ పార్టీ. బీఆర్ఎస్ హయాంలో ముస్లిం సోదరులకు ఎన్నో మంచి పనులు చేశాం. నాడు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అందరూ కలిసిమెలిసి ఉన్నారు. ముస్లిం బిడ్డలకు రంజాన్ తోఫా ఇచ్చాం. కాంగ్రెస్‌కు, బీజేపీకి ఓటు వేసినా ఎలాంటి ఉపయోగం లేదు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే దేశంలో సెక్యులర్ వ్యవస్థ కోసం పోరాడతాం. ముస్లిం బిడ్డలకు బ్రహ్మాండమైన గురుకులాలు పెట్టించాం. మన పాలనలో ముస్లిం సోదరులు ఫుల్ ఖుషీగా ఉన్నారు' అని కేసీఆర్ జగిత్యాలలోని ముస్లిం సోదరులను ఉద్దేశించి పేర్కొన్నారు.

> రాష్ట్రంలో ఒక కేంద్ర మంత్రి ఉన్నా ఐదు రూపాయల అభివృద్ధి కూడా జరగలే. మోదీ 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' సబ్ కా సత్యనాశ్ అయింది. మోదీది గ్యాస్ పురాణమే తప్ప దేశంలో ఒక్కరికి కూడా మేలు జరగలే. - కేసీఆర్

### బీడీ కార్మికులను ఆదుకున్నది బీఆర్ఎస్సే

జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో ఉన్న బీడీ కార్మికులను ఆదుకున్నది బీఆర్ఎస్ ఒక్కటేనని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ బీడీ కార్మికులను ఏనాడు ఆదుకోలేదని, ఎప్పుడూ రూపాయి పింఛను ఇవ్వలేదని కేసీఆర్ విమర్శించారు. బీడీ కార్మికులను ఆదుకున్నది, వారి బతుకులను నిలబెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనని కేసీఆర్ చెప్పారు. నేడు మోదీ ప్రభుత్వం బీడీ కార్ఖానాలను మూసివేస్తామంటే రేవంత్‌రెడ్డి ఆయనకు డబ్బా కొడుతున్నాడని, బీడీ కార్మికుల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తున్నాడని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కవులు, రచయితలారా ఆలోచించండి

'జగిత్యాలలో ఉన్న రమణయ్యసార్ వంటి కవులు, రచయితలు, మేధావులు, విద్యావంతులందరికీ మీ తెలంగాణ బిడ్డగా దండం పెట్టి చెప్తున్నా. నేను తెలంగాణను ఎంత బ్రహ్మాండంగా చేసిననో మీకు తెలుసు. నాడు ఇద్దరు ఎంపీలతోనే ఢిల్లీకి పోయి తెలంగాణ తెచ్చిన. నా కండ్లముందే తెలంగాణ ఆగమవుతుంటే నేను పిడికిలి బిగించి మీ ముందు కొచ్చా. చేజేతులా మీరు కృష్ణా, గోదావరి నీళ్లు, మన హక్కులను పోగొట్టుకోవద్దు. మన నిధులును మనం తెచ్చుకోవాలె. అందరం కలిసి ముందుకుపోవాలె' అని కోరారు. 'బీఆర్ఎస్ గెలుపులోనే తెలంగాణ విజయం ఉన్నది. కాబట్టే తెలంగాణ మేధావులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు, ఉద్యమకారులు అందరూ విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలి.



**జైకొట్టిన జగిత్యాల** | జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్‌షోలో పాల్గొన్న అశేష జనవాహిని

## జగిత్యాలలో జనజాతర

- కేసీఆర్‌కు అపూర్వ స్వాగతం
- అడగడుగునా గులాబీ పూలవాన
- అట్టహాసంగా సాగిన రోడ్‌షో

కరీంనగర్, మే 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జగిత్యాల, నమస్తే తెలంగాణ: ఉద్యమాల పురిటిగడ్డ జగిత్యాల ఆదివారం రాత్రి జన జాతరగా మారింది. జగిత్యాల చౌరస్తా నుంచి చూస్తే ఎటుచూసినా జన ప్రభంజనమే కనిపించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు జగిత్యాలలో ప్రజలు నీరాజనం పలికారు. దారి పొడవునా ఎదురేగి వెంట కదలివచ్చారు. కొత్త బస్టాండ్ పరిధిలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రారంభమైన రోడ్‌షో శ్రీనివాస థియేటర్, అంగడి బజార్, తహసీల్ కార్యాలయం మీదుగా పాత బస్టాండ్ చౌరస్తాకు చేరుకున్నది. మండుటెండను, ఉక్కపోతను సైతం లెక్క చేయకుండా కేసీఆర్ రాక కోసం గంటల తరబడి నిలబడ్డారు. బస్సులో నుంచి కేసీఆర్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగగా.. సంప్రదాయ నృత్యాలు, డప్పు చప్పుళ్లతో అట్టహాసంగా రోడ్‌షో సాగింది. రోడ్‌షో అనంతరం జగిత్యాల చౌరస్తాలో బస్సుపైకి కేసీఆర్ చేరగానే 'జై కేసీఆర్.. సీఎం కేసీఆర్' అంటూ ప్రజలు పెద్దపెట్టున నినదించారు.

### ఆలోచింపజేసిన కేసీఆర్ ప్రసంగం

జగిత్యాల రోడ్‌షోలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం ప్రజలను ఆలోచింపజేసింది. గత ప్రభుత్వం చేసిన పనులు, ఈ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న విషయాలపై బేరీజు వేసుకోవాలంటూ వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విషయంపై పలు ప్రశ్నలు అడిగారు. దీనికి ప్రజలనుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలను రద్దు చేస్తామంటున్నది.. జగిత్యాల జిల్లా ఉండాలా? వద్దా? అంటే.. ఉండాలి.. ఉండాలి.. అంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహిళలకు రూ.2,500 వచ్చాయా? రాలేదా? అన్న పశ్నకు రాలేదు.. అటూ మహిళలు చేతులెత్తి అడ్డంగా ఊపారు. మీకు రెండు లక్షల రుణ మాఫీ జరిగిందా? లేదా? అంటే కాలేదు.. కాలేదు అంటూ రైతులు ముక్తకంఠంతో చెప్పారు. రుణ మాఫీపై దేవుళ్లపై ఒట్టేసి చెపుతుండు.. ఇటువంటి ముఖ్యమంత్రిని నమ్మొచ్చా? అని కేసీఆర్ అడిగిందే తడవుగా.. నమ్మలేం.. నమ్మలేం.. అన్నీ మోసాలే జేస్తుండు అంటూ ప్రజల నుంచి సమాధానం వచ్చింది. రైతు భరోసా, రూ.500 బోనస్, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం గురించి అడిగినా రాలేదు.. అంటూ ప్రజలు పెద్ద ఎత్తున గొంతెత్తి చెప్పారు. గత ఎన్నికల్లో నలుగురు బీజేపీ ఎంపీలు గెలిచి ఏమైనా అభివృద్ధి చేశారా? అన్న ప్రశ్నకు లేదు.. లేదు అంటూ చెప్పారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు, గోదావరి నీటి తరలింపుపై, కాంగ్రెస్ మోసకారి విధానాలపై కేసీఆర్ ప్రసంగాన్ని ప్రజలు ఆసక్తిగా విన్నారు. నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌ను, కరీంనగర్ నుంచి వినోద్‌కుమార్‌ను, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కేసీఆర్ కోరగా, ప్రజలంతా చేతులెత్తి గెలిపిస్తాం.. అంటూ సంఘీభావం ప్రకటించారు.

### దారుల వెంట బారులు తీరిన జనం

వీణవంకలో ఆత్మీయ సమ్మేళనం ముగిసిన తర్వాత జగిత్యాలలో జరిగే రోడ్‌షోకు బయలుదేరిన కేసీఆర్‌కు.. రోడ్డు పొడువున ఉన్న గ్రామాల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. శంకరపట్నం మండలంలోని అముదాలపల్లి, ములంగూరు, కేశవపట్నం, తాడికల్ వద్ద కేసీఆర్‌ను చూసేందుకు జనం బారులు తీరి నిలబడ్డారు. మానకొండూరు మండల కేంద్రంతోపాటు గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్, కమాన్, తెలంగాణచౌక్, కొత్తపల్లి వద్ద కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సు రాగానే.. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేయగా.. మహిళలు మంగళహారులతో స్వాగతం తెలిపారు.